మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపరచాలి
- ప్రసవాల సంఖ్య మరింత పెంచాలి
- ప్రభుత్వ దవాఖానను సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- అధికారులకు ఆదేశాలు జారీ

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 8: వైద్యం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానను శుక్రవారం ఆర్డీవో సరితతో కలిసి పరిశీలించారు. ప్రతిరోజూ రోగులకు అందించే వైద్య సేవల వివరాలను సూరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్యశ్రీ సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. శుభ్రత పాటించాలని, వైద్యం కోసం దవాఖానకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని డాక్టర్లకు సూచించారు. దవాఖానలో మందుల కొరత ఏదైనా ఉంటే దవాఖాన డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి అత్యవసర మెడిసిన్ కొనుగోలు చేయాలన్నారు. మరోమారు దవాఖానను పరిశీలిస్తామని, అన్ని వైద్య సేవలు మెరుగ్గా కనిపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, స్పెషల్ ఆఫీసర్ వెంకట్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలోని రికార్డును పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపు

ఆదిబట్ల, నవంబర్ 8: ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి 18 ఏండ్లు నిండిన, యువత కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. 9,10 తేదీల్లో ప్రత్యేక క్యాంపుల్లో బూత్ లెవల్ అధికారులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటరు నమోదుతో పాటు, ఓటర్ల లిస్ట్‌లో తప్పులు సరి చేసుకోవచ్చని, సవరణలు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడు, రేపు స్పెషల్ క్యాంపు

కొడంగల్: కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి శనివారం, ఆదివారం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ క్యాంపింగ్ డే కార్యక్రమాన్ని బీఎల్వోలు బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. కేటాయించబడిన వార్డుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన యువతకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి సహకరించాలని కోరారు.

నాలెడ్జ్ సిటీలో ఇండియన్ వెయిన్ కాంగ్రెస్ -2024

కొండాపూర్, నవంబర్ 8: దేశంలో 25 శాతం మంది వెరికోస్ వెయిన్స్ (సిరలు) సమస్యతో బాధపడుతున్నారని ప్రముఖ వాస్క్యులర్ ఇంటర్ నేషనల్ నిపుణుడు డాక్టర్ రాజా వీ కొప్పాల అన్నారు. నాలెడ్జ్ సిటీలోని డిస్ట్రిక్ట్ 150 కాన్ఫరెన్స్ హాల్‌లో అవిస్ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇండియన్ వెయిన్ కాంగ్రెస్-2024కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని 25 శాతం మంది వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్నారని, వారిలో చాలా మందికి శస్త్రచికిత్సలు అవసరం లేకుండానే నయం చేసే అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వెరికోస్ వెయిన్స్ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో పలు దేశాల చెందిన 100 మంది నిపుణులు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలి

హాజిపల్లిని ఆకస్మికంగా తనిఖీ చేసిన రంగారెడ్డి కలెక్టర్

షాద్‌నగర్ రూరల్, నవంబర్ 8: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి గ్రామాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో యజమాని ఇచ్చిన వివరాలను తప్పులు లేకుండా ప్రొఫార్మాలో నమోదు చేయాలన్నారు. గృహజాబితా నమోదు పక్రియను పకడ్బందిగా పూర్తి చేసిన అనంతరం సమగ్ర కుటుంబ సర్వే వివరాలను సేకరించాలన్నారు. యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే నమోదు చేయాలన్నారు. సమగ్ర సర్వేకు ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని గ్రామస్తులకు తెలిపారు. నిర్ణీత సమయంలోనే సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, మండల విద్యాధికారి మనోహర్, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, రాధ, విష్ణు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే-24

కొండాపూర్, నవంబర్ 8: గోప్యతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని గణిత శాస్త్రజ్ఞులు, భద్రతా నిపుణులు ఎన్‌క్రిప్షన్ (గుప్తీకరణ), క్రిప్టోగ్రఫీ (గూఢ లిపి శాస్త్రం), క్వాంటం కమ్యూనికేషన్ల ద్వారా వివిధ భద్రతా అవసరాలను పరిశీలించాలని, రాబోయే 20 – 30 సంవత్సరాలకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ (ఎస్‌సీఐఎస్), ఇంటర్నెట్ సొసైటీ (ఐఎస్‌ఓసీ), హైదరాబాద్ చాప్టర్ సహకారంతో గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే – 2024 సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఎస్‌సీఐఎస్ డీన్ ప్రొఫెసర్ అతుల్ నేగి అధ్యక్షతన నిర్వహించిన ఒక రోజు సదస్సుకు వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గోప్యతా అవసరాల దృష్ట్యా గణిత, భద్రతా నిపుణులు ఎన్‌క్రిప్షన్, క్రిప్టోగ్రఫీ, క్వాంటం కమ్యూనికేషనల్ ద్వారా కఠినమైన భద్రతా వలయాలను సృష్టించాలన్నారు. రాబోయే 20 నుంచి 30 సంవత్సరాలకు ముందుగానే అప్రమత్తంగా ఉండేలా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.రుక్మ రేఖ, ఐఎస్‌ఓసీ ప్రెసిడెంట్ కే మోహన్ రాయుడు పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకారమే.. పత్తి కొనుగోలు

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

తాండూరు, నవంబర్ 8: పత్తి రైతులకు ఇబ్బందులు కలుగకుండా మద్దతు ధర చెల్లించాలని పత్తి కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం నియోజకవర్గంలోని మారుతి ఇండస్ట్రీయల్ పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరను రైతులకు ఇవ్వాలని, 8 శాతం తేమ ఉంటే రూ.7521 ధర ఉండగా, 9 శాతం తేమ ఉంటే రూ.7445 ఇవ్వాలని సూచించారు. రైతులు ఆరబెట్టి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. యాలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, సౌకర్యాలతో పాటు కావాల్సిన సదుపాయాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త

జిల్లా న్యాయసేవ సెక్రటరీ డీబీ శీతల్

వికారాబాద్, నవంబర్ 8: విత్తనాలు, ఎరువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవ సెక్రటరీ డీబీ శీతల్ అన్నారు. శుక్రవారం మదనపల్లిలో జాతీయ న్యాయసేవ సంస్థ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పంటలపైన, విత్తనాలు నాణ్యత ఉన్నాయా.. లేదా వాటిని కొన్న వారి నుంచి రశీదు తీసుకున్నారా లేదా వివరాలు తెలుసుకున్నారు. జిల్లా న్యాయసేవ సెక్రటరీ డీబీ శీతల్ మాట్లాడుతూ గ్రామాల్లో భూమిని కొన్నప్పుడు పేపర్ల మీద రాసుకుంటుంటారు.. కానీ భూమి కొన్న వారి పేరు మీదకు మారదన్నారు. ఇప్పుడు భూముల ధరలు పెరగడంతో అమ్మిన వారికి అదే భూమిని వేరే వారికి మళ్లీ అమ్మడమో లేదా కేసులు వేయడమో చేస్తారు. కాబట్టి భూమి కొన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మూడు లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారికి భూములకు సంబంధించి కేసులు ఉంటే ఉచితంగా న్యాయవాదిని పెడుతామన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారు కూడా వారి తప్పు తెలుసుకొని న్యాయసేవ సంస్థ ద్వారా ఇద్దరు రాజీ అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్న తగాదాలకు కుటుంబాలను దూరం చేసుకునే కంటే రాజీ మార్గంలో సమస్యను పరిష్కరించుకోవడం మంచిదని పేర్కొన్నారు. చట్టాలపైన అవగాహన కల్పించడమే జిల్లా న్యాయసేవ అధికార సంస్థ లక్ష్యం అన్నారు. కార్యక్రమం ఎస్సై అనిత, లీగలేడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, న్యాయవాది అవుటి రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ కార్యదర్శి డీబీ శీతల్

20 కేజీల క్లోరల్ హైడ్రేట్ పట్టివేత

వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి

వికారాబాద్/కొడంగల్, నవంబర్ 8: కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే 20 కేజీల క్లోరల్ హైడ్రేట్ కెమికల్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్టు జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్, కొడంగల్ పోలీసులు కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా స్విఫ్ట్ కారు అపకుండా వెళ్తుండగా పోలీసులు ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బషీరాబాద్‌కు చెందిన డ్రైవర్ అంబరపేట శ్రీకాంత్ గౌడ్ అని తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా 10 కేజీల క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో కల్తీ కల్లు తయారుచేసి విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. కర్ణాటకలోని చించోలికి చెందిన మేఘనాథ్‌గౌడ్, బషీరాబాద్ మండలానికి చెందిన నగేశ్‌గౌడ్ దగ్గర కొన్నట్టు తెలిపారు. మేఘనాథ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతను చితపూర్‌కు చెందిన ఉష్ణయ్యగౌడ్ దగ్గర కెమికల్‌ను కొన్నట్టు చెప్పాడన్నారు. మేఘనాథ్ గౌడ్ దగ్గరి నుంచి 5 కేజీలు, ఉష్ణయ్యగౌడ్ దగ్గర 5 కేజీలు క్లోరల్ హైడ్రేట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మొత్తం ఇట్టి కేసులో సుమారు 60,000 రూపాయల విలువగల 20 కేజీ ల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం నిందితులను రిమాండ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు. క్లోరల్ హైడ్రేట్ కలిపిన కల్లు తాగడం వల్ల మత్తుతో పాటు మెదడు, ఇతర శరీర బాగాల మీద ప్రభావం చూపి అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. కల్తీ కల్లును ఒకసారి సేవించిన వారికి డ్రగ్‌లా అలవాటు పడి బానిసవుతారని వివరించారు. ప్రజలు కల్తీ కల్లు తాగకూడదని సూచించారు. ఎక్కడైనా కల్తీ కల్లు సమాచారం ఉంటే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో ఎవరైనా కల్తీ కల్లు తయారు చేసినా, గంజాయి లాంటి మత్తు పదార్థాల వ్యాపారం చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. కొడంగల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ సత్యనారాయణ క్లోరల్ హైడ్రేట్ పట్టుకున్న సంఘటన వివరాలను వెల్లడించారు.

స్వాధీనం చేసుకున్న క్లోరల్ హైడ్రేట్, పోలీసుల అదుపులో నిందితులు

నేడు వర్కింగ్ డేనే..

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో నేటి రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 17న గణేష్ నిమజ్జనం సందర్భంగా సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నేటి రెండో శనివారాన్ని వర్కింగ్ డేగా పరిగణించాలని ఉత్తర్వులో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

టామ్‌కామ్ ఆధ్వర్యంలో మోటార్ రంగంలో ఉద్యోగావకాశాలు

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారికి ఉద్యోగవకాశాలు అందించడం కోసం దరఖాస్తులు స్వీకరణ జరుగుతుంది. కాగా, జర్మనీలో ఆటోమోటివ్ టెక్నిషియన్ల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మెర్సిడెజ్, స్కోడా, హ్యుండాయ్, నిస్సాన్, ఓపెల్, ఫోర్డ్, వోల్వో, వోక్స్ వ్యాగన్, ఫియత్ తదితర ప్రముఖ ఆటోమోటివ్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందొచ్చని తెలిపారు. అభ్యర్థులు కమర్షియల్ వాహన మెకాట్రానిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా సంబంధిత రంగంలో మూడేండ్లు అనుభవంతో కూడిన డిప్లమా కలిగి ఉండాలని తెలిపారు. వయో పరిమితి 20-40 ఏండ్ల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 94400 52592 / 94400 49013 లలో సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

సత్వర న్యాయం కోసం.. అదనపు కోర్టులు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాదే

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి



16వ జిల్లా న్యాయస్థానం ప్రారంభోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు, అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్, నవంబర్ 8: ప్రజలకు చేరువలో న్యాయస్థానాలు ఏర్పాటు చేసి, సత్వర న్యాయం కల్పించాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జిల్లా అదనపు కోర్టును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదే వర్చువల్‌గా ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తులు క్యామ కౌశి, వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజసేన్‌రెడ్డి హైకోర్టు నుంచి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం కోర్టు ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యక్షంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం అదనపు జిల్లా న్యాయమూర్తి జయప్రసాద్, ఇబ్రహీంపట్నం సీనియర్ న్యాయమూర్తి శంకర్ శ్రీదేవి పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సహాయం సకాలంలో అందించడానికి అదనపు న్యాయస్థానాలను ప్రారంభించి, మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ న్యాయమూర్తి రీటాలాల్ చందు, ప్రధాన జూనియర్ న్యాయమూర్తి యశంత్‌సింగ్, అదనపు న్యాయమూర్తి హిమబిందు, అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్, సీనియర్ న్యాయమూర్తులు సత్యవీర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, మహ్మద్‌గులాం, హైదర్, చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవలను విస్తృత పరుస్తాం:హైకోర్టు సీజే

షాద్‌నగర్ రూరల్: న్యాయ సేవలను మరింత విస్తృత పరుస్తామని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే అన్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు న్యాయార్తి రత్నపద్మావతి పర్యవేక్షణలో షాద్‌నగర్ కోర్టు అవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 16వ జిల్లా న్యాయస్థానాన్ని ఆయన వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ అరాదే మాట్లాడుతూ జిల్లా అదనపు కోర్టు ఏర్పాటుతో మరిన్ని న్యాయసేవలు అందుబాటులో ఉంటాయని, కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు, కక్షిదారులు పాటుపడాలని, చట్టాలపైన అవగాహన కలిగిఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు సీహెచ్ రాజ్యలక్ష్మి, ధీరజ్‌కుమార్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, న్యాయవాదులు జగన్మోహన్‌రెడ్డి, గంగాధర్, కరీం, రాజగోపాల్ పాల్గొన్నారు.

టీ హబ్‌లో 14న ఇండో-ఫ్రెంచ్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ సదస్సు



సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): ఇండో-ఫ్రెంచ్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ సదస్సును టీ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇండస్ట్రీ నిపుణులతో ఈ సదస్సులో చర్చలు ఉంటాయని తెలిపారు. ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులు వైద్య, ఆరోగ్య రంగంలో ఉన్న సమస్యలు, వాటిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేందుకు అవసరమైన వనరులను పరిశ్రమలు అందించేలా టీ హబ్ సహకరిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ కింది లింకులో (forms.office.com /r/r9NdthBQ94) సంప్రదించాలని తెలిపారు.

15 నుంచి 17 వరకు లీగల్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తొలిసారిగా లీగల్ ఎగ్జిబిషన్ జరగనుంది. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ లా కాలేజీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు లీగల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీగల్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి హాజరై ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లీగల్ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. లీగల్ వ్యవహారాలతో పాటు కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత చట్టాలపై అవగాహన కలిగించేలా పలు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ కళాశాలల విద్యార్థులతో పాటు లీగల్ వ్యవహారాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు లీగల్ ఎగ్జిబిషన్‌కు హాజరు కావొచ్చని ప్రిన్సిపాల్ వాణి తెలిపారు.

ఓటరు జాబితాకు సహకరించాలి

అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్

సిటీబ్యూరో, నవంబరు 8(నమస్తే తెలంగాణ): తప్పులేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో తప్పులు లేని ఓటరు జాబితా తయారీపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో రోల్ అబ్జర్వర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ప్రధాన భూమిక పోషిస్తుందని, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం ప్రత్యేక ముసాయిదా ఓటరు జాబితా అని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విడుదల చేశారన్నారు. ఈ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని చెప్పారు. ఈ నెల 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందని, డిసెంబర్ 24వ తేదీన క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కారం చేస్తారని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితాపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న ఫైనల్ పబ్లికేషన్ చేస్తారని వివరించారు. తుది ఓటరు జాబితాను వచ్చే జనవరి 6వ తేదీన విడుదల చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు కాంగ్రెస్ పార్టీ తరపున నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎంఐఎంఐ పార్టీ తరుపున చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ, బీజేపీ తరపున మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ తరుపున పి.రాజేశ్ కుమార్, బహుజన పార్టీ తరపున కే నంద కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున మొహ్మద్ సొహైల్, సీపీఎం తరపున ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూ దృష్టి..!

- నిరూపయోగంగా ఉన్న భూముల వివరాలు ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశాలు
- డిప్యూటీ కలెక్టర్ల పర్యవేక్షణలో మండలాల వారీగా భూములపై ఆరా

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. మండలాల వారీగా సర్కార్ భూముల లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం డిప్యూటీ కలెక్టర్లను రంగంలోకి దించారు. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం, సంస్థలకు, వ్యక్తులకు కేటాయించిన భూముల వివరాలను సైతం ఆరా తీస్తున్నారు. ఆ భూములు ఏ కోణంలో ఇచ్చినవి. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటి? నిరూపయోగంగా ఉన్నాయా? కారణాలేంటి? తదితర వివరాలు సేకరించడంతో పాటు నిరూపయోగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చేసి రెవెన్యూ అధికారులు హైదాబాద్ ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేస్తున్నారు. ఇటీవల షేక్‌పేట మండలంలో రూ.70 కోట్ల విలువైన భూమి 20 గుంటలను ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేశారు. మారేడుపల్లిలో 3 కోట్ల ప్రభుత్వ భూమి అధికారులు ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేశారు. వీటితో పాటు కొన్ని విలువైన భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా లా ఆఫీసర్ ఆధ్వర్యంలో కేసులపై ఎప్పటికప్పుడు వాదనలు వినిపించడం, ఆధారాలతో ఆ భూములను తిరిగి సర్కార్ ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేయడంపై అధికారులు దృష్టి సారించారు. కాగా, బంజారాహిల్స్‌లో సుమారు 47 సర్కారీ భూములపై కేసులు నడుస్తున్నాయని ఓ అధికారి తెలిపారు. ఇవన్నీ కోర్టులో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని సాధ్యమైనంత తొందరగా వాటిని ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేస్తామని ఓ అధికారి తెలిపారు. మండలాల వారీగా భూ లెక్కలపై త్వరగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సైతం అధికారులను ఆదేశించారు. దీంతో మండల తహసీల్దార్లు తమతమ పరిధిలోని ప్రభుత్వ భూములపై వివరాలు సేకరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు